క్లుప్తంగా

స్వప్నవారాహిదేవిగా శ్రీమహాదుర్గ

అమ్మవారికి సహస్ర కమల పుష్పార్చన



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ఉక్కునగరం: వారాహి నవరాత్రి పూజల్లో భాగంగా స్టీల్‌ప్లాంట్ త్రిశక్తి దేవాలయంలో శ్రీ మహాదుర్గ అమ్మవారిని శుక్రవారం స్వప్నవారాహిదేవి అవతారంలో అలంకరించారు. ఆలయ ప్రధానార్చకులు ఫణిశర్మ నేతృత్వంలో అమ్మవారికి సహస్ర కమల పుష్పార్చన చేశారు. త్రిలోక వార్తా స్వప్న దర్శనం కలిగేలా చేయాలంటూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

వామనావతారంలో జగన్నాథస్వామి



అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి ఇంద్రద్యుమ్న హాలు వద్ద వేంచేసియున్న జగన్నాథస్వామి దశావతారాల్లో భాగంగా శుక్రవారం వామనావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు గురు సంతోష్ సుభద్ర, బలభద్ర సహితంగా జగన్నాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఉదయం, సాయంత్రం పలు భక్తిగీతాలు ఆలాపించారు. ఆలయ కమిటీ, భక్తులు విశేష పూజలు చేశారు.

'అయ్యన్నవి మతి లేని మాటలు'

అగనంపూడి: మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడికి మతి భ్రమించిందని, అందుకే మతిలేని మాటలు మాట్లాడుతున్నారని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పూర్ణ, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి యలమంచిలి అప్పారావు విమర్శించారు. అగనంపూడిలో వారు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర బస్సు యాత్రలో వైఎస్సార్‌సీపీ నాయకుల గురించి దిగజారి మాట్లాడటం సరి కాదన్నారు. బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

ఆర్టీఏ అధికారుల తనిఖీలు



ట్రాన్స్‌పోర్టు బస్సును తనిఖీ చేస్తున్న ఆర్టీఏ అధికారులు

అగనంపూడి: పరిమితికి మించి లారీల్లో సరకుల రవాణా, ట్రాన్స్‌పోర్టు బస్సుల్లో సీటింగ్ సామర్థ్యం, బస్సుల్లో సరకుల రవాణా చేసే వాహనాలను గాజువాక ఆర్టీఏ అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. జిల్లా రవాణా కమిషనర్ రాజరత్నం, గాజువాక ఆర్టీవో జయప్రకాష్ ఆదేశాల మేరకు ఏఎంవీ లలిత, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ హరి ప్రసాద్ ఆధ్వర్యంలో అగనంపూడి టోల్‌గేటు వద్ద తనిఖీలు చేపట్టారు. పరిమితికి మించి సరకులు రవాణా చేస్తున్న లారీలు, ట్రాన్స్‌పోర్ట్ బస్‌లో సరకుల రవాణా, బస్సుల్లో సీటింగ్ కెపాసిటీకి సంబంధించి తనిఖీలు నిర్వహించి, నిబంధనలు అతిక్రమించిన వాహనాలపై కేసులు నమోదు చేశారు.

భెల్ సీఎండీ దృష్టికి హెచ్‌పీవీపీ యూనిట్ సమస్యలు

అక్కిరెడ్డిపాలెం: విశాఖపట్నం హెచ్‌పీవీపీ యూనిట్‌లో సమస్యలను బీఎంఎస్ సెంట్రల్ నాయకుడు అంగసామి ఢిల్లీలో భెల్ సీఎండీ, ఈడీ/హెచ్‌ఆర్‌ల దృష్టికి తీసుకువెళ్లినట్లు బీఎంఎస్ నాయకుడు చిన్నబాబు తెలిపారు. ఢిల్లీ లో జరుగుతున్న యూనియన్ సమావేశాల్లో పాల్గొనేందుకు వెళ్లిన ఆయన భెల్ యాజమాన్యాన్ని కలిసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా హెచ్‌పీవీపీ యూనిట్‌లో మూడు అంశాలపై యాజమాన్యంతో చర్చించారన్నారు. జేసీఎం తేదీ ప్రకటన, షిఫ్ట్ టైమింగ్స్, సూపర్‌వైజర్ల పదోన్నతి విషయాలను సీఎండీ దృష్టికి తీసుకువెళ్లగా సానుకూలంగా స్పందించారని తెలిపారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

- మేయర్ గొలగాని హరివెంకటకుమారి
- రాజీవ్ ఇండోర్ స్టేడియం ఆధునికీకరణకు శ్రీకారం
- పలు వార్డుల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మేయర్ హరి వెంకట కుమారి, ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: నగరంలో మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యత కల్పించామని జీవీఎంసీ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. జీవీఎంసీ 65వ వార్డు వికాస్‌నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో రూ.కోటితో చేపట్టనున్న ఆధునికీకరణ పనులకు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డితో కలిసి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ స్టేడియంలోని ఫ్లోరింగ్‌ను పూర్తిస్థాయిలో ఆధునికీకరించడంతో పాటు ఇంటర్ లాకింగ్ రబ్బర్‌తో పునరుద్ధరించనున్నట్లు చెప్పారు. క్రీడాకారుల కోసం సౌకర్యాలు కల్పిస్తామన్నారు. స్విమ్మింగ్ పూల్‌ను ఆధునికీకరించి వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. కొండవాలు ప్రాంతాలతో ముడిపడి ఉన్న వార్డుల్లోని ప్రధాన గెడ్డల ఆధునికీకరణకు రూ.2 కోట్లు కేటాయించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బొడ్డు నర్సింహపాత్రుడు, ఉరుకూటి చందు, జీవీఎంసీ డీఈ ఎంఆర్‌ఎస్ అప్పారావు, ఈఈ ప్రసాద్‌బాబు, ఏఈ గణపతి సూర్యారావు, వైఎస్సార్ సీపీ నాయకులు లోకనాథం, పెద్దింటి మంగునాయుడు, మద్దాల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

70వ వార్డులో..

గాజువాక : రూ.60 లక్షల వ్యయంతో 70వ వార్డులోని చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు మేయర్ గొలగాని హరివెంకటకుమారి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని వార్డుల్లోనూ అభివృద్ధి పనులను విస్తృతంగా చేపట్టామన్నారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ గాజువాక అభివృద్ధికి మేయర్ సహకారం అభినందనీయమన్నారు. కార్పొరేటర్ ఉరుకూటి చందు మాట్లాడుతూ ఎర్రగెడ్డ కాలనీ, శ్రీనివాసనగర్, శ్రామికనగర్‌లలో నీటి సరఫరాను మెరుగుపరిచేందుకు రూ.20 లక్షలతో పైప్‌లైన్ నిర్మాణం, తాబేలు కాలనీ నుంచి ఎర్రగెడ్డ కాలనీ వరకు రూ.20 లక్షలతో రోడ్డు, డ్రైన్ నిర్మాణం, చట్టివానిపాలెంలో రూ.20 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైన్ నిర్మాణం చేపట్టనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పాలఘాట్ కృష్ణ, అచ్చిబాబు, కొణతాల రాము, బాబులు నాయుడు, చట్టి అప్పలరాజు, చట్టి అప్పల నాయుడు తదితరులు పాల్గొన్నారు.



శ్రీనగర్ జంక్షన్‌లో శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగిరెడ్డి తదితరులు

జంక్షన్ల విస్తరణకు భూమిపూజ

జీవీఎంసీ 71వ వార్డులోని శ్రీనగర్ జంక్షన్, పోలీస్ స్టేషన్ జంక్షన్ల విస్తరణ, ఆధునికీకరణకు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. రూ.45 లక్షలతో శ్రీనగర్ జంక్షన్‌ను, మరో రూ.45 లక్షలతో పోలీస్ స్టేషన్ జంక్షన్‌ను విస్తరించనున్నట్టు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇప్పటికే పాతగాజువాక జంక్షన్ విస్తరణ పూర్తి కావచ్చిందని, ఈ రెండు జంక్షన్ల విస్తరణ పూర్తయితే ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో 71వ వార్డు కార్పొరేటర్ రాజాన రామారావు, 72వ వార్డు కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్, 70వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి చందు, 72వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి సిరట్ల శ్రీనివాస్, జెడ్పీ పి.సింహాచలం, స్థానిక నాయకులు సత్యనారాయణ, కె.కల్పన, పప్పల రాజు, నాగేశ్వర రావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రూ.40లక్షలతో ఆటోనగర్ కూడలి అభివృద్ధి

అక్కిరెడ్డిపాలెం: రాష్ట్రం యావత్తు ప్రజలు జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా కోరుకుంటున్నారని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. శుక్రవారం జీవీఎంసీ 69,70వ వార్డుల పరిధిలో గల ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ కూడలి అభివృద్ధి పనులు రూ.40 లక్షల వ్యయంతో అభివృద్ధి పనుల శంకుస్థాపన శిలా ఫలకాన్ని శుక్రవారం 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి, 70వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి చందుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఇచ్చిన మాట ప్రకారం ఎన్నికల హామీలను పూర్తిగా నెరవేర్చిన ముఖ్యమంత్రి ఒక్క వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి మాత్రమే అన్నారు. విద్యా, వైద్యంకు అధిక ప్రాధాన్యత కల్పిస్తూ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి రాష్ట్రాన్ని పరిపాలిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాత్రమే పూర్తి న్యాయం జరిగిందన్నారు. గాజువాకను అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తున్నానన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాజాన రామారావు, నాయుడు, జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సేవకు గుడివాడ కుటుంబం అంకితం

- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- గుడివాడ ఎల్లాయమ్మ విగ్రహావిష్కరణ



విగ్రహావిష్కరణలో పాల్గొన్న మంత్రి అమర్‌నాథ్, ఎమ్మెల్యే నాగిరెడ్డి తదితరులు

అక్కిరెడ్డిపాలెం: ప్రజాసేవకు 'గుడివాడ ' కుటుంబీకులు అంకితమయ్యారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కొనియాడారు. మింది గ్రామస్తులు గుడివాడ వంశాన్ని ఎప్పుడూ గుర్తుంచుకుంటారన్నారు. పెందుర్తి మాజీ ఎమ్మెల్యే దివంగత గుడివాడ అప్పన్న భార్య, రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ నాన్నమ్మ దివంగత గుడివాడ ఎల్లాయమ్మ విగ్రహాన్ని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌తో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. మింది గుడివాడ అప్పన్న మెమోరియల్ పార్క్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.దివంగత గుడివాడ అప్పన్న భార్య ఎల్లాయమ్మ దయాగుణ సంపన్నురాలని కొనియాడారు.ఎల్లాయమ్మ విగ్రహానికి మంత్రి అమర్‌నాథ్ మాతృమూర్తి గుడివాడ నాగమణి, ఉపముఖ్యమంత్రి బూడిముత్యాల నాయుడు కుమార్తె, జెడ్పీటీసీ అనూరాధ, ఎల్లాయమ్మ పెద్ద కుమారుడు, వైఎస్సార్‌సీపీ సీఈసీ మెంబర్ గుడివాడ అప్పలరామూర్తి, కార్పొరేటర్లు గుడివాడ అనూష, కాకి గోవింద రెడ్డి, ఉరుకూటి చందు, రాజాన రామారావు, బొడ్డు నర్సింహపాత్రుడు, 68వ వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గుడివాడ లతీష్, మార్కెటింగ్ కమిటీ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తి రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గుడివాడ అప్పన్న మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సంద్రాన నూకరాజు, నంబారు రాజు, శ్రీనివాసరావు, నేలపాటి సత్యవతి, గుడివాడ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో అర్హులందరికీ లబ్ధి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాల్సిన బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లపై ఉందని చెప్పారు. స్థానిక టీఎన్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శనివారం నుంచి నెల రోజుల పాటు ఈ బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకోవాలని సూచించారు. వెంటనే ఆ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూడాలన్నారు. ఈ సమస్యలన్నీ పార్టీ అధిష్టానానికి కూడా పంపిస్తామన్నారు. వెంటనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పందించి ఆ సమస్యను పరిష్కరించారో లేదో తెలుసుకుంటారని చెప్పారు. ఈ విషయంలో అందరూ జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. 99శాతం వరకూ ఇక్కడే సమస్యలను పరిష్కరించేలా చూడాలన్నారు. తీవ్రమైన సమస్యలుంటే పార్టీ అధిష్టానం చూసుకుంటుందన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, ఉరుకూటి చందు, రాజాన రామారావు, నాయకులు ధర్మాల శ్రీను, కోమటి శ్రీనివాసరావు, రాజాన వెంకటరావు, కులుకూరి మంగరాజు, మంత్రి శంకరనారాయణ, యువశ్రీ, వాడపల్లి రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో యువత భవిత దుర్భరం



యాంటీ డ్రగ్స్‌పై పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

గాజువాక : మత్తు పదార్థాలు, డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. మాదక ద్రవ్యాల నిరోధంపై సింహాద్రి టీఎంటీ, హిమ హ్యూమానిటేషన్ ఆధ్వర్యంలో స్థానిక టీఎస్సార్, టీబీకే కళాశాలలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. డ్రగ్స్ కోసం యువత నేరాలకు కూడా పాల్పడుతున్నారని, అది స్కూల్స్ వరకూ పాకడం విచారకరమన్నారు. దీనిపై పోలీసులతో పాటు తల్లిదండ్రులు కూడా అప్రమత్తంగా ఉండి, తమ పిల్లల నడవడికను గుర్తించాలన్నారు. జైల్ ఎస్పీ కిశోర్ కుమార్ మాట్లాడుతూ సరదా కోసం, స్నేహితుల ప్రోద్బలం ప్రభావంతో ప్రారంభించిన చెడు అలవాట్లు పిల్లల మెడకు చుట్టుకుంటాయన్నారు. స్పెషల్ మెట్రోపాలిటన్ కోర్టు మాజీ న్యాయమూర్తి పైల సన్నిబాబు మాట్లాడుతూ తమ పిల్లల నడవడికను, అలవాట్లను తల్లిదండ్రులు నిరంతరం గమనిస్తూ ఉండాలన్నారు. కార్యక్రమంలో భాగంగా తొలుత యాంటీ డ్రగ్స్‌పై పోస్టర్‌ను విడుదల చేసి విద్యార్థులకు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సింహాద్రి డైరెక్టర్ వి.వి.కృష్ణారావు, హిమ చైర్మన్ బి.ఎస్.మూర్తి, ప్రతినిధులు డాక్టర్ వి.సృజన్‌బాబు, టి.వి.డి.దాస్, కళాశాల చైర్మన్ బలరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డీఎల్‌ఎస్‌ఏ సభ్యుడిగా వినోద్‌బాలు నియామకం



గాజువాక : గాజువాక కోర్టు పరిధిలో పని చేసే డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ (డీఎల్‌ఎస్‌ఏ) సభ్యునిగా గాజువాకకు చెందిన వినోద్‌బాలు నియమితులయ్యారు. ఈ మేరకు ఏపీ స్టేట్ లీగల్ అథారిటీ శుక్రవారం గెజిట్‌ను విడుదల చేసింది. వినోద్ బాలు డీఎల్‌ఎస్‌ఏ సభ్యునిగా రెండేళ్లపాటు సేవలను అందించనున్నారు. వివిధ కేటగిరీలలో పలువురు వ్యక్తులు డీఎల్‌ఎస్‌ఏ సభ్యులుగా నియమితులు కాగా, వినోద్ బాలు సామాజిక సేవల విభాగంలో నియమితులయ్యారు. ఆయన రక్తదానంపై నిరంతరం నిర్వహిస్తున్న ప్రచారం, సేవల నేపథ్యంలో ఈ కమిటీలో చోటు దక్కింది. ఈ సందర్భంగా ఆయన్ను పలువురు అభినందించారు.

అదానీ గంగవరం పోర్టులో రక్తదాన శిబిరం



రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్ అందిస్తున్న పోర్టు యాజమాన్య ప్రతినిధి

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టు ఆవరణలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 150 మంది పోర్టు ఉద్యోగులు రక్తం దానం చేశారు. ఈ సందర్భంగా పోర్టు యాజమాన్య ప్రతినిధులు మాట్లాడుతూ సీఎస్సార్ కార్యక్రమంలో భాగంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. రక్తదానం చేయడం ద్వారా మరో ముగ్గురికి సాయం చేసినట్టువుతుందన్నారు. తమ ప్రాంతం పరిధిలోని పలుచోట్ల పేదలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేసిన ఉద్యోగులను అభినందించారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్ట్



హిమ్మత్ సింగ్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో నాలుగు రోజుల క్రితం జరిగిన దొంగతనం కేసు నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన సమాచారం మేరకు వివరాలివి.. ఈ నెల 19 రాత్రి స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ సెక్టార్-3 లోని 120 సీ క్వార్టర్‌లో ఇద్దరు వ్యక్తులు చొరబడి ఆ ఇంట్లో బీరువాను పగులకొట్టి బంగారం, వెండి, నగదును అపహరించిన విషయం తెలిసిందే. స్టీల్‌ప్లాంట్ క్రైం ఎస్ఐ ఎల్. శ్రీనివాసరావు నేతృత్వంలో క్రైం పోలీసులు కేసు విచారణలో దొరికిన ఆధారాల మేరకు అందులోని ఒకరైన మధ్యప్రదేశ్‌లోని ధార్ జిల్లా పరేటా గ్రామానికి చెందిన హిమ్మత్ సింగ్ (29)ను శుక్రవారం అరెస్ట్ చేశారు. అనంతరం కోర్టులో హాజరుపర్చగా అతనికి న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

దోమల నివారణకు సహకరించాలి



ర్యాలీలో పాల్గొన్న జెడ్పీ సింహాచలం తదితరులు

గాజువాక : వివిధ వ్యాధులకు కారణమవుతున్న దోమలను నివారించడానికి ప్రజలందరూ సహకరించాలని గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం కోరారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా 67వ వార్డులో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతీ శుక్రవారం డ్రై డే పాటించాలని కోరారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, జోనల్ సహాయ ప్రజారోగ్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ తీరుపై సీపీఐ ఆగ్రహం

గాజువాక : వెంకోజీపాలెంలోని జ్ఞానానంద ఆశ్రమం వద్ద ఆందోళన సమయంలో మహిళా నేత వనజాక్షిపై చేయి చేసుకున్న ఎస్ఐ దివ్యజ్యోతిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ సీపీఐ నాయకులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఆ పార్టీ గాజువాక కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ మహిళా సమాఖ్య, యువజన, విద్యార్థి సంఘాల నాయకులు ధర్నా చేస్తున్న సమయంలో మహిళా నాయకురాలు వనజాక్షిపై మహిళా ఎస్ఐ దురుసుగా ప్రవర్తించి కొట్టడం దుర్మార్గమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో సమస్యలను ప్రశ్నిస్తే పోలీసులు దాడులకు దిగుతారా అని ప్రశ్నించారు. మహిళా ఎస్ఐను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కె.అచ్యుతరావు, పోలయ్య, జి.ఆనంద్, అప్పారి విష్ణుమూర్తి, తాండ్ర కనకరాజు, వనజాక్షి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి నివాళి



ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

గాజువాక : భారతీయ జన సంఘ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి గాజువాక బీజేపీ నాయకులు నివాళులర్పించారు. పార్టీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు మాట్లాడుతూ ముఖర్జీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శశిధరన్ పిళ్లై, బాటా శ్రీను, గూటూరు శంకరరావు, నాగేశ్వరరావు, పేర్ల అప్పారావు, అమ్మ ట్రస్టు భాస్కర్, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

- **పెదగంట్యాడ:** జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని బాలచెరువులో శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు శశిధరన్ పిళ్లై ముఖర్జీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జీలకర్ర రమణ, సియాద్రి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలో ప్రతి ఇంటా సంక్షేమం



మహిళకు సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, వంశీరెడ్డి

పెదగంట్యాడ: ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన ఉందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. అర్హతే ప్రాతిపదికగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ఆయనకే చెందుతుందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 74వ వార్డు నెహ్రూనగర్‌లో కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డితో కలిసి శుక్రవారం ఆయన పర్యటించారు. వారికి ఈ నాలుగేళ్లలో చేకూరిన లబ్ధిని గురించి వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, జీవీఎంసీ ఏఈ వెంకటరావు, వర్క్‌ఇన్‌స్పెక్టర్ శ్రీహరి, నాయకులు ఎస్.వై. నాయుడు, బొడ్డు గోవింద, త్రినాథ్, ప్రసాద్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

పలు రైళ్ల రద్దు, మరికొన్ని గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం: ఖరగ్‌పూర్ డివిజన్ పరిధిలో జరుగుతున్న భద్రతాపరమైన పనుల కారణంగా పలు రైళ్లను రద్దు చేసినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఈ నెల 24న హౌరా-తిరుపతి (22889) ఎక్స్‌ప్రెస్, హౌరా-ఎర్నాకుళం (22877) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 24, 25వ తేదీల్లో షాలిమార్-హైదరాబాద్ (18045) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్-షాలిమార్ (18046) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 25న సంత్రగచ్చి-మంగుళూరు (22855) ఎక్స్‌ప్రెస్, హౌరా-పుదుచ్చేరి (12867) ఎక్స్‌ప్రెస్, తిరుపతి-హౌరా (22890) హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 26న సికింద్రాబాద్-అగర్తలా (07030) ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేశారు.

- వాల్తేర్ డివిజన్ కేకే లైన్ పరిధిలో భద్రతా కారణాల వలన ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లను ఆయా తేదీల్లో గమ్యం కుదిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. విశాఖపట్నం-కిరండూల్ (18514) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 25 నుంచి జూలై 1వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. కిరండూల్-విశాఖపట్నం (18513) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 26 నుంచి జూలై 2వ తేదీ వరకు దంతేవాడ నుంచి బయలుదేరి విశాఖపట్నం చేరుకుంటుంది.
- విశాఖపట్నం-కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ ఈ నెల 25 నుంచి జూలై 2వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. కిరండూల్-విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్ ఈ నెల 26 నుంచి జూలై 3వ తేదీ వరకు దంతేవాడ నుంచి బయలుదేరి విశాఖపట్నం చేరుకుంటుంది.

స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటాం

కూర్మన్నపాలెం: కేంద్రంలోని మోదీ సర్కార్ విధానాల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. కార్మికులకు అండగా ఉంటూ, మోదీ ప్రభుత్వ కుట్ర రాజకీయాలను ఎండగడతామని స్పష్టం చేశారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షల్లో 862వ రోజు, శుక్రవారం స్టీల్‌ప్లాంట్‌లోని పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ లాభాల్లో ఉన్న విశాఖ ఉక్కు పరిశ్రమను మోదీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు పావులు కదపడం దుర్మార్గమన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రభుత్వరంగంలోనే కొనసాగే వరకు పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

రూ.98 లక్షలతో శ్మశానవాటికల అభివృద్ధి

అగనంపూడి: అంతిమ సంస్కారాలకు అవస్థలు పడకుండా ఉండేందుకు జీవీఎంసీ పరిధిలోని గ్రామాల్లో అభివృద్ధి పనులతో పాటు కనీస వసతులు కల్పిస్తున్నామని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ అన్నారు. 88వ వార్డు వెదుళ్లనరవ, నంగినారపాడు (అజినగిరి) గ్రామాల్లో రూ.98 లక్షలతో చేపట్టనున్న కైలాసభూముల అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్మశానం చుట్టూ ప్రహరీ నిర్మాణం, షెడ్లు, బోరు నిర్మాణం చేపట్టేందుకు ఒక్కో శ్మశానానికి రూ.49లక్షలు నిధులు కేటాయించామన్నారు. పనులు సత్వరం పూర్తయేలా అధికారులు శ్రద్ధ తీసుకోవాలన్నారు.

విలీనగ్రామాల్లో సమస్యల పరిష్కారం : జీవీఎంసీ విలీన గ్రామాల్లో ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం కూడా కనీస వసతులు కల్పించలేని పరిస్థితుల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి ముందుకు వచ్చిందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఎం. ముత్యాలు, వైస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి గండ్రెడ్డి కనక మహాలక్ష్మినాయుడు, మాజీ కార్పొరేటర్ చొప్పా నాగరాజు, ఇందల సీతారామయ్య, శేఖరమంత్రి శ్రీనివాసరావు, సర్వసిద్ధి బొరయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'కు మండల ప్రత్యేకాధికారులు

దొండపర్తి: జగనన్న సురక్ష పర్యవేక్షణకు మండల స్పెషల్ ఆఫీసర్ల(ఎంఎస్‌వో)ను నియమించారు. ఈ మేరకు కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో 11 మండలాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం సక్రమంగా అమలయ్యే విధంగా 11 మంది ఎంఎస్‌వోలు పర్యవేక్షించనున్నారు. పద్మనాభంకు ఎన్‌హెచ్-16 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఎల్ఏ), భీమునిపట్నంకు ఆ డివిజన్ ఆర్డీవో, ఆనందపురానికి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(కేఆర్‌ఆర్‌సీ), విశాఖ రూరల్‌కు స్టీల్‌ప్లాంట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(ఎల్ఏ), సీతమ్మధారకు జీవీఎంసీ శానిటేషన్ అండ్ రెవెన్యూ అడిషనల్ కమిషనర్, మహారాణిపేటకు జీవీఎంసీ ఏడీసీ జనరల్‌ను నియమించారు. అలాగే గోపాలపట్నంకు జీవీఎంసీ యూసీడీ పీడీ, ములగాడకు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, గాజువాకకు వీఎంఆర్‌డీఏ ఎస్టేట్ ఆఫీసర్, పెదగంట్యాడకు జిల్లా సహకార శాఖాధికారి, పెందుర్తికి డీఆర్‌డీఏ పీడీకి బాధ్యతలు అప్పగించారు.

'గురుపౌర్ణమి' పోస్టర్ ఆవిష్కరణ

పెదగంట్యాడ: స్థానిక సమతానగర్‌లోని షిర్డీసాయి శాంతిధామంలో ఈ నెల 29 నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు గురుపౌర్ణమి ఉత్సవాలు నిర్వహించనున్నామని ఆలయ కమిటీ చైర్మన్ లక్ష్మణరావు తెలిపారు. ఈ మేరకు ఆలయ ఆవరణలో ఉత్సవాల పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సాయి సేవకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ సమాచారం

స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకునికి సత్కారం



రమణయ్యను సత్కరిస్తున్న జీఎం, ఇంటక్ నాయకులు

ఉక్కునగరం: స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకుడు, ఎనర్జీ మేనేజ్‌మెంట్ విభాగం (ఈఎండీ) ఉద్యోగి ఎల్.వి. రమణయ్యను శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ నెలాఖరున పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా విభాగంలో నిర్వహించిన కార్యక్రమంలో జీఎం సుధాకర్ మాట్లాడారు. కార్మిక నాయకునిగా కార్మికుల సమస్యల పరిష్కారంతో పాటు విభాగం అభివృద్ధికి రమణయ్య ఎనలేని కృషి చేశారన్నారు. ఐఎన్‌టీయూసీ నాయకులు మంత్రి రాజశేఖర్, నీరుకొండ రామచంద్రరావు తదితరులు ప్రసంగించారు. కారు రమణ, కొమ్ము ప్రసాద్, బీఎంకె నాయక్, ప్రభాకరరెడ్డి, డి.మోహన్, మధు తదితరులు పాల్గొన్నారు.